# మహిళల బాధను విస్మరించిన స్మృతి

- నెలసరి సెలవులపై కేంద్ర మంత్రి వైఖరి దారుణం
- అది సహజమైన జీవ ప్రక్రియ.. ట్విట్టర్‌లో ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): మహిళా ఉద్యోగులకు నెలసరి సెలవుల ప్రతిపాదనను కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ వ్యతిరేకించడం మహిళల బాధను విస్మరించడమేనని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. కేంద్ర మంత్రి వైఖరి మహిళా లోకాన్ని నిరుత్సాహపరిచిందని ట్విట్టర్ వేదికగా ఆమె అసంతృప్తిని వ్యక్తం చేశారు.



రుతుక్రమ పోరాటాలను మంత్రి కొట్టిపారేయడం విచారకరమని పేర్కొన్నారు. నెలసరి ఎంపిక కాదు.. అది సహజమైన జీవ ప్రక్రియ అని తెలిపారు. వేతనంతో కూడిన సెలవులను తిరస్కరించడం అసంఖ్యాకమైన మహిళలు అనుభవిస్తున్న బాధను విస్మరించినట్టేనని పేర్కొన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న వాస్తవిక సవాళ్ల పట్ల కనీసం సానుభూతి చూపకపోవడం విస్తుగొలిపే అంశమని ఆవేదన వ్యక్తం చేశారు. విధానాల రూపకల్పనకు, వాస్తవికతకు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చాల్సిన సమయం ఇది' అని కవిత పేర్కొన్నారు.

### ప్రజల ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు

బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పట్ల ప్రేమాభిమానాలు కనబర్చిన ప్రజానీకానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కృతజ్ఞతలు తెలిపారు. యశోద దవాఖాన నుంచి డిశ్చార్జి అయిన తర్వాత కేసీఆర్ బంజారాహిల్స్ నందినగర్‌లోని తన నివాసానికి చేరుకున్నారని ఆమె ట్విట్టర్‌లో పేర్కొన్నారు. తుంటి మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతమై దవాఖాన నుంచి కేసీఆర్ డిశ్చార్జి అయ్యారని, చికిత్స అందించిన యశోద డాక్టర్లు, నర్సులతో పాటు అన్నివిధాలా సహకరించిన దవాఖాన సిబ్బందికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ క్లిష్టమైన సమయంలో దేశ నలుమూలల నుంచి లభించిన ప్రేమాభిమానాలకు కృతజ్ఞులమని ఆమె పేర్కొన్నారు.

# పోచంపల్లి ఇక్కత్ భౌగోళిక గుర్తింపు పునరుద్ధరణ



హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): పోచంపల్లి ఇక్కత్ చేనేత ఉత్పత్తికి సంబంధించిన భౌగోళి గుర్తింపును మరో పదేండ్లకు పునరుద్ధరించారు. ఈ మేరకు జియోగ్రఫికల్ ఇండికేషన్స్ (జీఐ) ఏజెంట్ సుభాజిత్ సాహా శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. భారతదేశ భౌగోళిక గుర్తింపు పొందిన మొట్టమొదటి చేనేత ఉత్పత్తి కేంద్రం 'పోచంపల్లి ఇక్కత్' కావడం విశేషం. తొలిసారిగా 2004లో రిజిస్ట్రేషన్ పొందింది. ఇదిలా ఉండగా, జీఐ చట్టం ప్రకారం భౌగోళిక గుర్తింపు అమలులో ఉండటానికి ప్రతి 10 ఏండ్లకు ఓసారి పునరుద్ధరించుకోవాల్సి ఉంది. దీంట్లోభాగంగా తాజాగా మరోసారి ఇక్కత్ జీఐని పునరుద్ధరించారని సాహా తెలిపారు. త్వరలోనే పోచంపల్లి ఇక్కత్ లోగో కూడా పునరుద్ధరణకు నోచుకుంటుందని ఆయన పేర్కొన్నారు. భౌగోళిక గుర్తింపు కోసం భారత్ నుంచి 15,000 కంటే ఎక్కువ ఉత్పత్తులకు అవకాశం ఉందని, ప్రస్తుతం 1,158 దరఖాస్తులు మాత్రమే జీఐ రిజిస్ట్రీలో నమోదు అయ్యాయని తెలిపారు. రాబోయే 3 ఏళ్లలో 5000కంటే దరఖాస్తులు వచ్చే అవకాశముందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఏపీ ప్రాజెక్టుల విస్తరణను అడ్డుకోండి

- కేఆర్ఎంబీకి తెలంగాణ లేఖ

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): ఏపీ ప్రభుత్వం ట్రిబ్యునల్ అవార్డుకు విరుద్ధంగా హంద్రినీవా, గాలేరునగరి సుజలస్రవంతి, తెలుగుగంగా ప్రాజెక్టుల విస్తరణను చేపడుతున్నదని, వెంటనే ఆ పనులను అడ్డుకోవాలని కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ)కు రాష్ట్ర నీటి పారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్ శుక్రవారం లేఖ రాశారు. ఏపీ ప్రభుత్వం హెచ్ఎన్ఎస్ఎస్, జీఎన్ఎస్ఎస్, టీజీపీ ప్రాజెక్టుల విస్తరణను తీవ్రంగా ఆక్షేపించారు. పునర్విభజన చట్టం ప్రకారం ఇరు రాష్ట్రాలు ఎలాంటి కొత్త ప్రాజెక్టులు చేపట్టినా, అప్పటికే వినియోగంలో ప్రాజెక్టుల సామర్థ్యాన్ని విస్తరించినా ముందుగా కేఆర్ఎంబీ, లేదంటే అపెక్స్ కౌన్సిల్ అనుమతులను తీసుకోవాల్సి ఉంటుందని, ఆ చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఏపీ ప్రభుత్వం ఆయా ప్రాజెక్టుల విస్తరణను చేపడుతున్నదని, టెండర్లను ఆహ్వానించిందని వెల్లడించారు. ఇప్పటికైనా ఏపీ సర్కారును నిలువరించాలని, పనులను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# పోస్టింగుల్లో సమతుల్యం పాటించాలి

- బీసీ సంక్షేమ సంఘం డిమాండ్

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): ప్రస్తుత ప్రభుత్వంలో ఐఏఎస్, ఐపీఎస్ ఇతర కీలక పోస్టింగులు, బదిలీల్లో ఒకే కులం వారికి పెద్దపీట వేయకుండా ప్రభుత్వం సామాజిక సమతుల్యత పాటించాలని, అన్ని కులాల్లో ప్రతిభ ఉన్న నీతి నిజాయితీ గల బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ మహిళా అధికారులకు ప్రాధాన్యతనివ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొద్ది మంది అగ్రకుల అధికారుల మాటలు వినకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు సమాన అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# 9 మంది ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 9 మంది కొత్త ఐఏఎస్‌లకు ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇచ్చింది. 2021 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్‌లకు అడిషనల్ కలెక్టర్లుగా (స్థానిక సంస్థలు) పోస్టింగ్‌లు ఇస్తూ సీఎస్ శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.








